# మమతలే మరుగై

దూర ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్న కిష్టయ్య చాలా కాలం తర్వాత ఊరెళ్ళాడు. కిష్టయ్య తండ్రి వీరయ్య, తల్లి లింగమ్మ అక్కడే ఉంటున్నారు. వీరయ్య వ్యవసాయం చేస్తూ బతుకుతున్నా అప్పట్లో నాలుగైదు తరగతి వరకు చదువుకున్నాడు. ఇంత కాలంగా ఎవరికీ తలవంచకుండా భూమినే నమ్ముకొని బతుకుతున్నాడు. కిష్టయ్యకు తండ్రంటే ఎంతో గౌరవం.

భోజనాలవీ ముగించి చెరో మంచంలో కూర్చున్నారు కిష్టయ్య, వీరయ్య... ఊళ్ళలో వస్తున్న మార్పుల గూర్చి మరెన్నో విషయాల గూర్చి మాట్లాడుకుంటున్నారు... కొద్ది కొద్దిసేపైంతర్వాత.

''కోడలు బాగుందా..?'' అడిగాడు వీరయ్య.

''బాగానే ఉంది నాన్న''

మనవరాలేం చదువుతోంది...?

''తొమ్మిదయిపోయింది''

''మనుమన్నైనా తీసుకురాకపోయావా..?

''అక్కడుంటే నాతో తీసుకొచ్చేవాణ్ణే...బాబుది ఇంటర్ అయిపోయిందిగదా...? కోచింగ్‌కు పంపించాను.

కిష్టయ్య మాటలతో వీరయ్య ముఖంలో రంగులు మారాయి.

''కోచింగంటే''

''డాక్టర్ కోర్సులో సీటు కోసం చదివిస్తున్నాను. ఇప్పుడు నెల్లూరులో ఉన్నాడు నీ మనవడు..''

వీరయ్య ముఖం వివర్ణమైంది. మిన్ను విరిగి మీద పడ్డట్టు, జరుగకూడదనిదేదో జరుగుతున్నట్టు ఆందోళన పడుతున్నాడతను.

''ఎందుకు పంపిచావక్కడికి. ఆ చదువులేకుంటే బతుకరా...?'' సూటిగా చూస్తూ అడిగాడు వీరయ్య.

తండ్రి మాటలు వింతగా తోచాయి కిష్టయ్యకు. మనువడు పెద్ద చదువులు చదువుతానంటే సంతోషించాల్సిందిపోయి ఇలా ఎందుకంటున్నాడో కిష్టయ్యకర్థం కాలేదు. అట్లని వీరయ్య కొడుకు కుటుంబం అభివృద్ధిని కోరని వాడేంకాదు. తండ్రికేం సమాధానమివ్వాలో అతని అంతరంగమేమిటో

కిష్టయ్యకర్థం కాలేదు. కొద్ది క్షణాలాగి,

''ఈ కాలంలో ఉద్యోగాలు దొరకడం ఎంతో కష్టంతో కూడుకున్న పని. ప్రతిదాంట్లోనూ విపరీతమైన పోటీ... బి.ఏ. లో, ఎం.ఏ. లో చదివితే జీవితంలో స్థిరపడటం అంతసులువు కాదు. డాక్టరో ఇంజనీరో అయితే ఏదో విధంగా నెట్టుకు రావచ్చుని...'' అన్నాడు.

''కాదు... రెండుచేతులా అడ్డగోలుగా సంపాదించొచ్చని.. కార్లలో, మోటార్లలో తిరగొచ్చుని..''

వ్యంగ్యంగా అన్న తండ్రి మాటలకు మరింత ఆశ్చర్యం కలిగింది కిష్టయ్యకు. ఈ రోజు తండ్రికేమైంద్ అతనికిర్థమవడం లేదు. ఎన్నడూ లేంది ఎందుకంత ఎకసెక్కెంగా మాట్లాడుతున్నాడో అతనికి తోచడం లేదు.

''నాన్నా! ఈ రోజు నీకేమైంది? ఎందుకిలా మాట్లాడుతున్నావు? నీ మనుమడు బాగా చదివి అభివృద్ధిలోకి రావడం నీకిష్టం లేదా? వాడు పేరుకొస్తే నీకు సంతోషం కాదా?'' అన్నాడు కిష్టయ్య...

''ఎందుకు సంతోషం కాదు? కాని, కాని నాకు పట్టిన గతే నీకు పట్టగూడదని నా ఏడుపు. వ్యవసాయదారుడి కడుపులో పుట్టిన నీవు చదువుకొని, ఉద్యోగస్థుడవై మాకు దూరమయ్యావు. ఉద్యోగస్థుడివైన నీ కొడుకు మరింత బాగా చదివి నీకంటే పెద్దవాడై నీకు దూరమవుతాడేమోనని నా భయం'' కడుపులోంచి సొద తన్నుకొస్తుండగా కనుగుడ్ల నిండా నీళ్ళతో అన్నాడు వీరయ్య.

తండ్రి మాటలతో కిష్టయ్య షాక్ తిన్నాడు. 'తాను తల్లిదండ్రులకు దూరమయ్యాడా? తనను తానే ప్రశ్నించుకున్నాడు. సమాధానం దొరికీ దొరకనట్టుందతనికి. ' ఒకవేళ తన తండ్రి చెప్పిందే నిజమయితే తాను తన కొడుక్కి దూరమైపోగలడా?'

కిష్టయ్యకంత గజిబిజిగా ఉంది. చికాకుగానూ ఉంది. తండ్రి మాటల్లోని లోతు గూర్చి ఆలోచిస్తున్నాడు. ఏం మాట్లాడలేదు.

''చిన్న తనంలో నువ్వు మాకా చిన్ని కృష్ణుడివే. నిన్నంతకంటే కూడా ముద్దుగానే పెంచాము. అయితే ఆ తల్లి 'యశోద' కు పట్టినగతే మాకూ పట్టింది. ద్వారక వెళ్లిన కృష్ణుడి కోసం ఆ యశోదెంత పరితపించిపోయిందో మేమూ నీకోసమలాగే పరితపిస్తున్నాం.''

తండ్రి మాటలతనికి కొత్తగా ఉన్నాయి. తండ్రిలో ఇంతావేదన గూడుకట్టుకట్టుకొనుందన్నది అతని ఆలోచనకు కూడా అందని విషయం. తండ్రి చెప్పిన పోలిక గూర్చి ఆలోచిస్తున్న కిష్టయ్యకు అందులో నిజముందేమోననిపిస్తుంది. తండ్రితో ఏమనాలో తోచక

''నాన్నా! మీకేమైంది? ఇలా ఎందుకు మాట్లాడుతున్నారు?'' అన్నాడు. ''మాకైందే నీకు కావద్దన్నదే నా బాధ? నిన్ను చదివించి మేం పొరపాటు చేశాం. కన్నయ్యను పోగొట్టుకున్న యశోదలా నీ తల్లెంత దుఃఖిస్తుందో నీకేమైనా తెలుసా..? మా హృదయాలెంత తూట్లు పడుతున్నాయో నువ్వెన్నడైనా ఆలోచించావా...?'' అన్నాడు వీరయ్య.

''నేను మీకు దూరమయ్యానా? మిమ్మల్ని మరిచున్నానా? నేనింటికి వస్తూనే ఉన్నానుకదా...! అప్పుడప్పుడు డబ్బులిస్తూనే ఉన్నాను కదా..!''

''వస్తున్నావు. ఏ ఆర్నెల్లకో, ఏడాదికో మొక్కుబడికన్నట్లు వచ్చి ముఖం చూపించిపోతున్నావు. నీ భార్యకు ఈగూనపెంకలింట్లోకి రావడానికిష్టముండదు. నీ పిల్లలనూ రానీయదు. అసలు మేమంటూ

ఉన్నామని వాళ్ళకు తెలుసో తెలియదో...? మురికి మురికి బట్టలతో, రుమాళ్ళతో, గోచీలతో మోటుగా ఉండే మేము మీ దగ్గరికొచ్చుంటే మీకు నామర్దా. ఇక నువ్వు మాకు దూరంగాక ఏమైనట్టు బాబూ...? డబ్బుతోనే అన్ని పనులు కావు... డబ్బు చేయలేనివీ ఎన్నో ఉన్నాయి.

నాకు నా మనుమలు మనుమరాళ్ళతో ఆప్యాయంగా మాట్లాడాలనుంది. కలిసి ఆడుకోవాలనుంది. నాతో నా చేల్లో తింపాలనుంది. నా కొడుకును దగ్గరకు తీసుకొని పక్కన కూర్చొని భోంచెయ్యాలనుంది. కొడుకు కోడలందరితో కలిసి తనివితీరా మాట్లాడాలనుంది. మరివ్వన్నీ సాధ్యమయ్యేవేనా? చెప్పు బాబూ...''

వీరయ్య మాటలు సూటిగా గుండెకు తగిలాయి కిష్టయ్యకు కడుపులో చేయిపెట్టి కెలికినట్టయింది. బాగా ఆలోచిస్తే వీరయ్యన్న మాటల్లో చాలా వరకు నిజముందనిపిస్తుంది. చాలా రోజులుగా ఏదో తనకే తెలియని వెలితితో బాధపడుతున్న కిష్టయ్య తండ్రి మాటలతో ఎన్నో విషయాలు జ్ఞాపకం వచ్చాయి. తండ్రితో వాదించడానికతని దగ్గర తన కనుకూలమైన పాయింట్లు దొరకడం లేదు. ందుకే.

''అవును. నాన్నా! మీరన్నదాంట్లో నిజముంది...'' అన్నాడు.

''కిష్టన్నా! నువ్వొక్కనివే ఇలా చేస్తున్నావని అనడం లేదు. చాలా మంది విషయంలో ఇలానే జరుగుతుంది. ఈ చదువుల్లోనే ఇలాంటి గుణముంది. మనూళ్ళో, ఇంకే ఊళ్ళోనైనా చూడు.... చదువుకున్న కొడుకులూర్లొదిలి వెళ్లిపోతే ఇండ్లల్లో ముసలివాళ్ళొంటరిగా ఉంటున్నారు. కొందరికేమో ఊళ్ళో ఉండి వ్యవసాయాలు చేసుకునే కొడుకులుండగా ఉంటున్నారు. నౌకర్లు చేసే కొడుకుల దగ్గరుండే తల్లిదండ్రులు తక్కువ. కొందరున్నా వాళ్ళ పరిస్థితి అక్కడేం బాగా లేదనుకుంటాను'' అన్నాడు.

ఎన్నో జీవితానుభవాలతో చెబుతున్న వీరయ్య కిష్టయ్య కళ్ళముందెంతో ఉన్నతంగా కనబడుతున్నాడు. అయితే ఈ చదువులు మనుషులను దూరం చేస్తున్నాయని, ఈ చదువుల వల్లే తాను తల్లిదండ్రులకు దూరమయ్యాడన్న విషయాలు కిష్టయ్యకు మింగుడు పడకుండా ఉన్నా, తనను తాను సమర్థించుకోడానికతని దగ్గర ఏ ఆధారాలూ లేవు.

''అవును... కాని ఇప్పుడా విషయాలన్నీ ఎందుకు నాన్నా?''

''ఎన్నో రోజులుగా చెప్పాలనుకుంటున్నాను. ాని చెప్పలేక పోయాను. ఇప్పుడు నీ కొడుకు విషయం వచ్చేసరికి చెప్పకుండా ఉండలేకపోతున్నాను. పెద్ద పెద్ద చదువులు మంచివే కాని అవి ఎవరికుపయోగపడుతున్నాయి. నిన్ను మీ అత్తగారెత్తుకుపోయారు. అలాగే పల్లెల్నుంచి పైకొచ్చిన చాలామందిని పట్నాల వాళ్లెత్తుకుపోతున్నారు. ఈ చదువులు, ఉద్యోగాలు ఏ విధంగా పల్లెలకుపయోగపడటం లేదు. మరి కొందర్ని విదేశాలు తన్నుకుపోతున్నాయి. మన పక్కూర్లనుంచి ఇంజినీరైన రాజేశం, డాక్టరైన బాపుశెట్టి అమెరికాకెళ్ళారు. అక్కడే ఉంటున్నారు. వాళ్లు మనకెలా ఉపయోగపడుతున్నారు. కాకపోతే తల్లిదండ్రులకు కొంత డబ్బు పంపిస్తున్నారేమో. అదీ చేయనివాళ్లెందరో ఉన్నారు''.

కిష్టయ్య కళ్ళకిప్పుడు తండ్రి జీవితాన్ని కాచి వడపోసిన వ్యక్తిలా కనబడుతున్నాడు. అయితే పెద్దగా చదువులేక వ్యవసాయాన్నే నమ్ముకొని బతుకుతున్న వీరయ్య కింత సునిశిత పరిశీలనా జ్ఞానం అలవడడానికి వెనుకగల మూలాలు మాత్రమాతనికి అర్థం కావడం లేదు. అతని స్వీయానుభవాలే అతనితో ఇలా మాట్లాడిస్తున్నాయన్న విషయం తెలియడం లేదు. కిష్టయ్యేం మాట్లాడలేదు. కాని అతని తల్లి భర్తతో...

''రాక రాక వచ్చిన కొడుకుతో నిగ్వేం మాటలు..? మనుమడు పెద్ద చదువులు చదువుతే నీదేం బోతుంది...? మనకు పెట్టకుంటేంబాయె...? వాళ్ళకు వాళ్ళున్న మంచిగ బతుకుతె మనకు సంతోషంగాదా?'' అంది.

''నీకు తెలియదుర్నో... ఏం బోతుందో చూసుకుంటూనే, అనుభవించుకుంటూనే ఎందుకు నటించడం...? కొడుక్కు దూరమై నువ్వెంత తపిస్తున్నావో నాకు తెలియదా...? భార్యమీదికి లేస్తూ అన్నాడు వీరయ్య.

''అమ్మేమందనిలేవడం? ఆగునాన్నా... ఆగు'' అని లేచి తండ్రిని దగ్గరకు తీసుకున్నాడు. పసివాడ్ని హత్తుకున్నట్లు హృదయానికి హత్తుకున్నాడు. తన స్పర్శతో తండ్రి పులకరించి పోవడం గమనించాడు. కొద్ది క్షణాలు వాళ్ళలాగే ఉన్నారు. కొడుకు చేతుల్లోంచి విడిపోయి కొంత దూరం జరిగి అన్నాడు వీరయ్య..,,

''కిష్టన్నా! నా మనవడు పెద్ద డాక్టరయితే నాకెంతో సంతోషం గుంటుంది... కాని ఈ పెద్ద చదువులు మనుసులను దూరం చేస్తున్నాయి. ముఖ్యంగా పల్లెలకు మరీ దూరం చేస్తున్నాయి. మేము మా కన్నయ్యను పోగొట్టుకోవడం నాకిష్టం లేదు. నేను చెప్పేది చెప్పాను... తర్వాత నీ ఇష్టం...''

వీరయ్య కళ్ళవెంట పటపటా నీళ్ళు కారుతున్నాయి. తండ్రినోదార్చాడు కిష్టయ్య. తల్లి బయట పడటం లేదు కాని ఆమె పరిస్థితీ అలాగే ఉందని గమనించాడు. అతని హృదయం భారమైంది.

''ఊళ్ళోకి పోయొస్తాను..'' తల్లిదండ్రులకు చెప్పి బయలుదేరాడు... పాత స్నేహితులతో మాట్లాడాడు. మరి కొందరిండ్లకు వెళ్ళి మాట్లాడాడు.

కొద్దిసేపు 'మూడు బజార్ల' దగ్గర కూర్చున్నాడు. ఎవరితో మాట్లాడుతున్నా, ఎక్కడున్నా కిష్టయ్య చెవుల్లో తండ్రి మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. మరో రెండు రోజులూళ్ళోనే ఉన్నాడు. ఎంతోమందిని కలిశాడు. చదువుకొని ఉద్యోగాలకెళ్ళిన వాళ్ళిండ్లలో ముసలివాళ్ళకు తోడుగా వ్యవసాయం చేసుకుంటూ బతికే కొడుకో, కూతురో ఉండటం గమనించాడు లేదా ముసలివాళ్ళొంటరిగా ఉండటం చూసాడు.

''చదువుకున్నోళ్లు ఊళ్ళనేడపట్టించుకుంటారే కిష్టన్న? ఊళ్ళెదుబ్బుందని గిక్కడికత్తరా? పట్నాలల్ల బంగ్లాలు గట్టుకొని గక్కన్నె ఉంటరు. ఊరుమొకం సూసేటోల్లు తక్కువ'' అన్న రైతుల మాటలు విన్నాడు.

''సదువుకున్నోళ్లు అవ్వయ్యలను పట్టించుకుంటారు...! అల్లంత లంగలు పో...'' అన్న మాటలూ విన్నాడు కిష్టయ్య.

తండ్రి మాటలు తాను చూసిన విషయాలు తెలుసుకున్న సంఘటనలను మననం చేసుకున్న కిష్టయ్యకీ చదువులు కన్నయ్యలను దూరం చేస్తున్నట్టు, పరాయీకరణకు గురి చేస్తున్నట్టు అర్థమవుతోంది.

'అందరి సంగతేమోకాని తన విషయంలో ఎక్కడ మొదలైంది ఎక్కడ...? తనను తానే ప్రశ్నించుకున్నాడు.

కిష్టయ్య మనసు వీటికి గలమూలాలను అన్వేషిస్తూ గతాన్ని వెతుకుతోంది...

భూమిని దున్నుకుంటూ బతికే కిష్టయ్య తల్లిదండ్రులు కొడుకును చదివించాలని బళ్ళో వేశారు... చదువుకునే కొడుకంటే వాళ్ళకు అపురూపం. వాళ్ళు చలిదో, బొలిదో తింటూ కొడుక్కు వేడన్నం

పెట్టేవారు. తాము ఏబట్టలు కట్టుకున్నా సరే చదువుకునే వాడికి మంచి బట్టలుండాలని తమ శక్తి మేరకు మంచి బట్టలుకొనేవారు. తాము నేలపై పడుకుంటూ కొడుక్కు మంచం ఇచ్చేవారు.

ఒక్కోసారి తల్లికొడుక్కు పని చెప్పేది. అప్పుడు తండ్రి ''చదువుకునే పిల్లవాడికెందుకే పనిచెప్తావు...'' అని తల్లిని కసిరేవాడు. తండ్రికొడుక్కి పని చెప్పినప్పుడు

''చదువుకున్నాడు మోటుపని చేస్తాడా. మంచోనివే ఉన్నావు. నువ్వు జేసుకుంటేంబోయె..'' అని తల్లనేది.

తప్పని పరిస్థితుల్లో కొన్ని పనులు చెప్పినా అవి తమ కొడుకు చేయాల్సిన పనులు కావనుకుంటూనే చెప్పేవారు.

కిష్టయ్య కాలేజీ చదివే రోజుల్లో దవాఖానాకనో, మరేదైనా పనిమీదనో అతని తల్లిదండ్రులువొచ్చేవారు. అప్పుడుకొడుకుగది కొచ్చేవారు. వచ్చేటప్పుడు కొడుకు తినాలని వండిన మాంసం తీసుకొచ్చేవారు. వాళ్ళను చూసి కిష్టయ్య రూమ్మేట్స్ ముఖాలుచిట్లించేవారు. మొరటుగా ఉన్న తల్లిదండ్రులను అమ్మానాన్నలని చెప్పుకోవడానికి సిగ్గుపడే మిత్రులను చూశాడు కిష్టయ్య.

చదువయిపోయింతర్వాత ఉద్యోగమూ, పెళ్ళి దాదాపు ఒకేసారయిపోయాయి. కిష్టయ్యకు అన్ని వసతులున్న ప్రభుత్వ గృహం లభించింది. అక్కడుండేదంతా మంచి జీతాలున్న ఉద్యోగులే. కిష్టయ్య తల్లిదండ్రులు అప్పుడప్పుడు అతడుంటున్నప్పుడు ఇంటికొచ్చే వారు. పంచె, రుమాలుతో వీరయ్య, గోచీ పెట్టి కట్టుకున్న చీరతో లింగమ్మ ఉండడం చూసి కిష్టయ్య భార్య ముఖం చిట్లించేది. ఇరుగుపొరుగు వారూ పరోక్షంగా హేళనచేసేవారు.

''మీ మామలు కూలి చేసుకుంటారా? అంటున్నారు చాలా మంది.

ఆ మాటలు వింటుంటే నాకవమానంగా ఉంది. మనమెలాగూ ఊరికెళ్తున్నాం గదా! వాళ్ళిక్కడికి రాకుంటే ఏం బోతుంది'' అంది కిష్టయ్య భార్య.

చుట్టూ ఉన్న వాతావరణాన్ని చూసి ఆమె పుట్టి పెరిగిన వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ మాటలను సీరియస్‌గా తీసుకోలేదు కిష్టయ్య.

మరి రెండు మూడుసార్లన్నా ఆ మాటలకు విలువివ్వలేదు.

అయితే ఓ రోజు రాత్రి కిష్టయ్య చెంపలకు చెంపలానించింది. పెదవులను పెదవులతో కలిపింది. అతని తలలోనికి వేళ్ళు పోనిచ్చింది. భర్తను దగ్గరకు తీసుకుంటూ...

''ఏమండీ! చుట్టుపక్కల వాళ్ళ మాటలను భరించలేకుండా ఉన్నాను. ఎందుకండీ వాళ్ళిక్కడికి రావడం? వాళ్ళమీద ప్రేమలేక కాదు. కాని చిప్పిరెంటుకలతో గోచీతో మీ అమ్మ. అమ్మ వారిలా ఇంటి ముందు కూర్చుంటేనే నాకవమాన మనిపిస్తుంది. వాళ్లు వాష్‌బేసిన్లో ఉమ్మేస్తారు. నీళ్ళు కూడా వదలరు. లావెటర్‌ని 'గలీజ్'చేస్తారు. వాళ్ళకు డబ్బు పంపుతాం. మనమే పొయ్యివద్దాం. వాళ్ళిక్కడికి రాకుంటే ఏం బోతుంది చెప్పండి'' అంది.

మరోసారి అంతకంటే దగ్గరవుతూ కిష్టయ్య భార్య ''మీ భార్యగా మన కుటుంబం కోసం కాకుంటేనేనెందుకంటాను? మీ ప్రతిష్టే నా ప్రతిష్టకాదా? ఫలానా వాళ్ళు మీ తల్లి దండ్రులని ఆడవాళ్ళు నవ్వుకుంటుంటే నాకవమానకరంగా లేదా?'' అంది ఏడ్చింది.

తూడ్చింది.

తన చుట్టూ ఉన్న వాళ్ళంతా కూడా దాదాపుగా ఇదే పరిస్థితిలో ఉండటం చూసి తనకు తాను సమాధానం చెప్పుకున్నాడు.

తాను చదువుకున్నప్పుడు ఊళ్ళో ఉన్నప్పుడు తమ్మీ, కొడుకా అంటూ ఆప్యాయయంగా పిలిచేవాళ్ళు తన కుద్యోగమైన తర్వాత మీరు అంటూ తనను దూరముంచి పిలవడం గమనించాడు.

ఓ రోజు తాను ఉద్యోగం చేస్తున్న టౌన్‌సిప్‌లో బస్టాండు కొచ్చాడు కిష్టయ్య... చెట్టుకిందో స్త్రీ కూర్చొనుంది. నెరసిన ఆమె వెంట్రుకలు చిందరవందరగా ఉన్నాయి. పాతబట్ట కట్టుకొనున్న ఆమె కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. ఏంటని అడిగాడు కిష్టయ్య.

''నా కొడుకున్నేనుకడుపుల పెట్టుకొని సాదిన. ఒళ్ళపెట్టుకొని సెంచిన, సేనాల్ల ఇంటికిపోతే ఇజ్జత్ పోతదట. నా గోచి చీరగట్టుడు మోటట. నేనాల్ల ఇంట్ల ఉండద్దట. నా కోడలు ఎల్లగొట్టింది..'' అందామె ఏడుస్తూ..

''మరి నీ కొడుకేమన్నాడు...?''

''అదెంత చెప్పుతే ఆనికంతే... నేను కనపడ్తే నే మొకం మాడ్సుకుంటడు. ఇయ్యాల్ల ఆఫీసురాయయినె...''

ఎంతో మంది వెనుకబడిన కుటుంబాల్నుంచి వచ్చి వాళ్ళు కూడా ఉద్యోగులైన తర్వాత తమ పాత జీవితాలను మరిచిపోవడం గమనించాడు కిష్టయ్య. ఆ జీవితాలకు దూరంగా మరీ దూరంగా పరుగెత్తుకుంటూ పోవడం కొత్త కొత్త స్నేహాలను చేయడం అతని జ్ఞాపకాల్లో కదిలింది...

అన్నీ జ్ఞాపకం చేసుకున్న కిష్టయ్య హృదయం భారమైంది. చాలామంది విషయంలో ఈ చదువులు శ్రమ విలువను తెలుసుకునే అవకాశాన్ని కల్పించడం లేదన్న విషయం కిష్టయ్యకు స్పష్టంగా అర్థమైంది. అందువల్ల ఉద్యోగాలు దొరకని వాళ్ళు రెంటికి చెడ్డ రేవళ్ళా తయారు కావడం గమనించాడు. తన పిల్లలు తనకంటే కూడా ఎక్కువ పరాయీకరణకు గురికావడం కిష్టయ్య స్మృతిపథంలో కదిలింది.

''ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ తమ మూలాలను వెతుక్కుంటున్నాయి. అన్ని దేశాలకూ మూలాలున్నాయి. ఒక్క అమెరికాకు తప్ప... ఎందుకంటే అక్కడున్న వాళ్ళంతా పరదేశాల నుంచి వచ్చి స్థిరపడిన వాళ్ళే''. అన్న ఓ తాత్వికుడి మాటలు జ్ఞాపకం వచ్చాయి కిష్టయ్యకు.

'అంతా తమ మూలాలను వెతుక్కుంటుంటే మన చదువులు మూలాలనే మరిచిపోయేలా చేస్తున్నాయి. ఊళ్ళకు దూరంగా తీసుకెళ్తున్నాయి...' తనలో తానే గొణుక్కున్నట్టు అనుకున్నాడు కిష్టయ్య.

'అందుకేనా చలం ఈ చదువులను ద్వేషించింది?' తనను తానే ప్రశ్నించుకున్నాడు.

కిష్టయ్య మనసు రకరకాల సంఘర్షణలకు లోనవుతోంది. 'తాను చదువుకున్నాడుకాబట్టే ఈ స్థితిలో ఉన్నాడు.

ఆ చదువే తనను ఊరికి, కన్నవారికి దూరం చేసింది.

నాన్న చెప్పినట్టు తాను తన తల్లిదండ్రులకు దూరమైనట్టుగా తనకొడుకు తనకు' దూరమైతే బతుకగలడా? కొడుకును పెద్ద చదువులు చదివించి తానూ తన కన్నయ్యను పోగొట్టుకోబోతున్నాడా...?

ఈ ఆలోచనే భరింపరానిదిగా ఉంది కిష్టయ్యకు...

మరి తన కొడుకును పెద్ద చదువులకు సంపించొద్దా...?

ఇక భార్య మాటలు వినక తప్పలేదు కిష్టయ్యకు. అంతకుముందు రెండు మూడు నెలలకోసారి కిష్టయ్య తల్లిదండ్రులతని దగ్గరికి వచ్చే వారు లేదా కిష్టయ్యే తీసుకొచ్చేవాడు. ఆ తర్వాత ఏడాదికోసారైంది. ఆ వెనుక వాళ్ళు రావడమే బందయింది. కిష్టయ్య వాళ్ళే అక్కడికి వెళ్లి చూసొచ్చే వారు.

కొద్దికాలం తర్వాత కిష్టయ్య భార్య,

''నాకా పల్లెటూరికి రావాలంటే చికాకు. కాలకృత్యానికి 'ముంత' పట్టుకుని బయటికెళ్ళాలి... మంచాలడ్డం పెట్టుకొని బావి మీదనే స్నానం చేయాలి. వానాకాలం నయితే ఈగలు, దోమలు... నేను రాను... మీరే పోయిరండి'' అంది.

ఆ మాటలకూ ఔననక తప్పలేదు కిష్టయ్యకు...

కొంత కాలం గడిచింది. రెండు మూడు నెలల కోసారి ఊరెళ్ళికిష్టయ్య తల్లిదండ్రులను చూసివస్తున్నాడు.

ఓ రోజు కిష్టయ్య భార్య భర్తను దగ్గరకు తీసుకొని,

''మనకు ఖర్చులు పెరుగుతున్నాయి. మీరు మాటిమాటికీ ఊరెళ్ళితే ఎంతఖర్చు కావాలి? ఎలాగూ డబ్బు పంపిస్తున్నారుగా... అక్కడికి పోవడమెందుకు? పోయి మాత్రమేం చేస్తారు? ఇక్కన్నుంచి ఎవరైనా తేపతేపకెళ్తూ న్నారేమో చూడండి. మీకే ఉన్నారా తల్లిదండ్రులు'' అంది.

భార్య మాటలూ నిజమేననిపించాయి కిష్టయ్యకు. ఊరికి పోవడం తగ్గించాడు. ఆర్నెల్లకో సారి ఆ తర్వాత ఏడాదికోసారి పోవడం ప్రారంభించాడు.

ఈ మధ్య వాళ్ళకు పిల్లలయ్యారు. ఖర్చులుపెరిగాయి.

కిష్టయ్య భార్య భర్తతో చాలా సార్లంది.

''మనకూ పిల్లలున్నారు. వాళ్ళు పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్ళను పెంచాలి పెద్ద పెద్ద చదువులు చదివించాలి. ఇవన్నిటికీ ఎంత డబ్బు కావాలి? మీరు మీ తల్లిదండ్రులకు డబ్బు పంపించకుంటేం బోతుంది? అక్కడ ఎంతో కొంత భూముంది కదా? దానిపై వచ్చే ఆదాయం వాళ్ళకు చాలదా? నా మాటలుకొంచెం సట్టించుకోండి''

భార్య మాటలు వినీవినీ డబ్బు పంపించడం మానుకున్నాడు కిష్టయ్య. ఎప్పుడైనా ఊరెళ్ళినప్పుడు వందో, రెండొందలో ఇచ్చి వస్తున్నాడు.

ఓసారి ఊరెళ్ళిన కిష్టయ్యతో...

'' ఒక్కసారి పిల్లలను తీసుకురా బిడ్డా...'' అంది తల్లి.

ఆ విషయమే భార్యతో చెప్పాడు.

'' పల్లెటూళ్లో ఏముందండీ...? మట్టి.... దుబ్బ... బురద.. మురికి... పిల్లలు దుమ్ము ధూళిలో ఆడి ఆరోగ్యం పాడుచేసు కుంటారు. ఆమురికి కూపాల్లోకెళ్ళడం నా కిష్టం లేదు...'' అందామె.

ఒకటి రెండు సార్లు తప్ప పిల్లలను ఊరికి తీసుకెళ్ళింది లేదు... అదీ ఒకటిరెండు రోజులుంటే ఎక్కువే.

క్రమక్రమంగా కిష్టయ్య తాను, తన భార్యపిల్లలు అన్న వరకే పరిమితం చేసుకున్నాడు. తన కుటుంబం అన్న పరిధిలోకి తల్లిదండ్రులకు కూడా ప్రవేశం లభించలేదు. ఆధునిక ఫర్నీచర్, కలర్ టివి. స్కూటర్లు, స్నేహాలు.. వీటికే అలవాటు పడ్డాడు...

ఈ విషయం మాత్రం సరైందనిపించడం లేదు కిష్టయ్యకు...

'ఎలుకలున్నాయని ఇల్లు తగలబెట్టుకుంటామా?' తనకు తానే ప్రశ్న ద్వారా సమాధానం చెప్పుకున్నాడు...

మరీ చదువుల్లో ఉన్న తమ మూలాలను మరిచిపోయేలా చేస్తున్న అంశాలను తొలగించడం ఎలా...?

కిష్టయ్య ఆలోచిస్తూనే ఉన్నాడు రైలు తాను దిగాల్సిన ఊరు చేరుకున్నదీ గమనించడం లేదు.

ఆదివారం ఈనాడు 16-10-94

# శ్రీకాకుళంలో పగం

